క్లుప్తంగా

టైలరింగ్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కొలిమిగుండ్ల: టైలరింగ్ శిక్షణ కోసం మహిళలు దరఖాస్తు చేసుకోవాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ప్రసాదరెడ్డి గురువారం తెలిపారు. వెనుకబడిన తరగతుల కో–ఆపరేటివ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 45 రోజులు, 60, 90 రోజుల టైలరింగ్ శిక్షణ ఉంటుందన్నారు. వెనుకబడిన తరగతులు, కమ్మ, రెడ్డి, కాపు, ఆర్యవైశ్య, బ్రాహ్మణ, క్షత్రియ, ఈబీసీలకు చెందిన 18 నుంచి 50 ఏళ్లలోపు మహిళలు అర్హులన్నారు. ఆయా గ్రామాల్లోని సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

వివాహ వేడుకలో కాటసాని



నూతన వధూవరులతో కాటసాని రామిరెడ్డి

కోవెలకుంట్ల: పట్టణంలోని లక్ష్మీ వెంకటేశ్వర ఫంక్షన్ హాలులో గురువారం సంజామల మండలం ఆకుమల్ల వైఎస్సార్‌సీపీ నాయకుడు ముక్కర మహేశ్వరరెడ్డి కుమారుడు కిరణ్‌కుమార్‌రెడ్డి, కీర్తి వివాహం జరిగింది. బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ అవుకు మండల ఇన్‌చార్జ్ కాటసాని తిరుపాల్‌రెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. వారితో పాటు పార్టీ నాయకులు సిద్ధంరెడ్డి రాంమోహన్‌రెడ్డి, గౌరిగారి కిరణ్‌కుమార్‌రెడ్డి, గౌరుగారి వెంకటేశ్వరరెడ్డి తదితరులు ఉన్నారు.

కంప్యూటర్ టెక్నీషియన్ కోర్సుకు ఉచిత శిక్షణ

బనగానపల్లె రూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని స్కిల్‌హబ్‌లో అసిస్టెంట్ టెక్నీషియన్ (కంప్యూటర్ హార్డ్‌వేర్) కోర్సులో ఉచిత శిక్షణ కోసం దరఖాస్తులు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లలిత తెలిపారు. 10వ తరగతి ఆపై చదివిన అభ్యర్థులు tinyurl.com/gdcbpl వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకోవాలని చెప్పారు. ఎంపికైన అభ్యర్థులకు ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 30 రోజుల పాటు ఉచిత శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు.

నేటి నుంచి ప్రతిష్ఠోత్సవాలు

కోవెలకుంట్ల: పట్టణంలోని గాంధీసెంటర్‌లో నూతనంగా నిర్మించిన అన్నపూర్ణ సమేత కాశీ విశ్వనాథస్వామి ఆలయంలో శుక్రవారం నుంచి మూడు రోజులపాటు ప్రతిష్ఠాత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు గురువారం తెలిపారు. మొదటిరోజు గంగాయనం, గోపూజ, గణపతిపూజ, పుణ్యాహవచనం, మాతృకాపూజ, పంచగవ్యమేళన, అఖండ దీపారాధన, యాగశాల ప్రవేశం, తదితర పూజా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. భక్తులు పూజ కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు.

తాగునీటి సమస్య రానీయొద్దు

ప్యాపిలి: గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాశ్ రెడ్డి అధికారులను ఆదేశించారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో గురువారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. వేసవిలో అధికారులు గ్రామాల్లో పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలన్నారు. తాగునీటి ఎద్దడి నెలకొన్న గ్రామాల్లో ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలన్నారు. బోర్లు అవసరమైన గ్రామాలను గుర్తించి తన దృష్టికి తీసుకురావాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు, పీఆర్‌ఏఈ ప్రభాకర్ రెడ్డి, ఎంఈఓ వెంకటేశ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు టోపీలు పంపిణీ



టోపీలు అందుకున్న విద్యార్థులు

డోన్ టౌన్: పట్టణంలోని నెహ్రూనగర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు దాతలు ఇజ్రాయిల్ రాజ, ఉషారాణి ఆర్థిక సాయంతో గురువారం టోపీలను అందజేశారు. ఎండ కాలం దృష్టిలో ఉంచుకుని వీటిని అందజేసినట్లు దాతలు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాసులు, జాన్ ప్రభాకర్ పాల్గొన్నారు.

9న ఉమ్మడి జిల్లా స్థాయి సబ్ జూనియర్ కబడ్డీ పోటీలు

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 9వ తేదీన పట్టణంలోని శ్రీవెంకటేశ్వర విద్యామందిర్ క్రీడా మైదానంలో సబ్ జూనియర్ కబడ్డీ బాలురు, బాలికలు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ ఏపీ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే వారు 30–03–2009 తర్వాత జన్మించి, 55 కేజీల్లోపు బరువు ఉండాలన్నారు. క్రీడాకారులు వచ్చేటప్పుడు ఆధార్ కార్డు, టెన్త్ క్లాస్ మార్క్స్ మెమో తీసుకొని రావాలన్నారు. జిల్లా స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు మార్చి 14వ తేదీ నుంచి 16వ తేదీ వరకు కడప జిల్లా పులివెందుల వైఎస్సార్ స్టేడియంలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. అసోసియేషన్ సభ్యులు సు.దాకర్, మున్నాబాషా, సుబ్రహ్మణ్యం, నాగరాజు, శివలింగమయ్య, సురేష్‌నాయుడు, మారెళ్ల నాగరాజు పాల్గొన్నారు.

ఆరోగ్యానికీ పరీక్షే..!

- పదో తరగతి పరీక్షల నేపథ్యంలో విద్యార్థులపై ఒత్తిడి
- ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం
- నిద్ర, పౌష్టికాహారానికి ప్రాధాన్యత ముఖ్యం

ఏడాది శ్రమ.. ఫలితానికి పరీక్షలే ప్రామాణికం. అందుకే పరీక్షలు సమీపించేకొద్దీ విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పదో తరగతి పరీక్షలపై ప్రత్యే దృష్టి సారిస్తారు. పరీక్షలంటే కొందరు విద్యార్థులకు భయం, ఆందోళన వస్తుంటాయి. విద్యార్థులు అధిక సమయం చదవడం, పౌష్టికాహారం తీసుకోకపోవడం, నిద్ర పోకుండా చదవడం వల్ల మానసిక ఒత్తిడికి గురవుతుంటారు. పరీక్షలంటే సాధారణమని, సామాజికమని చెబుతూ వైద్యులు విద్యార్థుల్లో మనోధైర్యం నింపుతున్నారు.

అవుకు: విద్యార్థి దశలో పరీక్షలకు ఎంతో ప్రాధాన్యత ఉంటుంది.ఏడాదిపాటు చదివిన విద్యను చివరి మూడు గంటలు జరిగే పరీక్షల్లో చూపించాలి. రాసి న పరీక్షల్లో వచ్చిన మార్కుల ఆధారంగానే తదుపరి చదువులు ఆధారపడి ఉంటాయి. ప్రస్తుతం ఇంటర్మీడియట్ పరీక్షలు జరుగుతున్నాయి. ఈనెల17వ తేదీ నుంచి పదో తరగతి పరీక్షలూ ప్రారంభమవుతాయి. పరీక్షల నేపథ్యంలో విద్యార్థులపై విపరీత మైన ఒత్తిడి ఉంటుంది. బాగా చదివి ఉత్తమ మా ర్కులు సాధించాలని కొందరు, వెనుకబడిన విద్యార్థులు ఎలాగైనా పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాలని మరికొందరు, మంచి మా ర్కులు సాధిస్తే తమకు నచ్చిన కాలేజీల్లో చేరవచ్చనే ఉద్దేశంలతో ఆరోగ్యంపై శ్రద్ధ చూపకుండా రాత్రింబవళ్లు చదువుతున్నారు. దీనివల్ల ఆరోగ్యంపై తీవ్ర ప్రభా వం చూపుతుంది. పదో తరగతి మార్కులకే కాదు విద్యార్థుల ఆరోగ్యానికి ఇది పరీక్షా సమయమే.

ప్రణాళికతో మంచి ఫలితాలు

పదో తరగతి పరీక్షలకు ఇప్పటికే హాల్ టికెట్లు జారీ అయ్యాయి. ప్రతి రోజూ సబ్జెక్టులపై గ్రాండ్ టెస్టులు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే ప్రీ పబ్లిక్ పరీక్షలు జరిగాయి. పరీక్షల సమయంలో విద్యార్థులు చదువుతో పాటు యోగా చేయాలని వైద్యులు సూచిస్తున్నారు. ప్రత్యేక ప్రణాళికతో విద్యార్థులు ముందుకు సాగితే ఆనందంగా పరీక్ష రాయవచ్చు. పరీక్షల సమయంలో ఆరోగ్య పరిరక్షణ ఎంతో కీలకం. బనగానపల్లె నియోజకవర్గంలో 54 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 3365 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనున్నారు.



అవుకు బాలికల ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులు (ఫైల్)

బనగానపల్లె నియోజకవర్గంలో పదో తరగతి విద్యార్థుల సంఖ్య

మండలం	ఉన్నత పాఠశాలలు	పదో తరగతి విద్యార్థులు
అవుకు	12	530
కొలిమిగుండ్ల	12	575
సంజామల	08	359
కోవెలకుంట్ల	08	748
బనగానపల్లె	14	1153
మొత్తం	54	3365

పౌష్టికాహారం తీసుకోవాలి



శరీరం, మనస్సు ఒకదానికొకటి అవినాభావ సంబంధం కలిగి ఉంటాయి. మనం తీసుకునే ఆహారం ఈ రెండింటినీ ప్రభావితం చేస్తుంది. పరీక్షల సమయంలో మానసికంగా, శరీరకంగా ఆరోగ్యంగా ఉండాలి. పోషక విలువలున్న ఆహారాన్ని సమపాళ్లలో తీసుకోవాలి. మనం తీసుకునే ఆహారంలో రోజు ఒక పండు, వారంలో రెండు రోజులు ఆకు కూరలు ఉండేలా చూసుకోవాలి. పరీక్షలు పూర్తయ్యేవరకు సాత్వికాహారం తీసుకుంటే మంచిది.

–డాక్టర్ యమున, ఉప్పలపాడు పీహెచ్‌సీ, అవుకు

ఒత్తిడికి గురికావద్దు



పరీక్షల సమయంలో విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా మానసికంగా ధృడంగా ఉండాలి. ముందుగా ప్రశ్న పత్రాన్ని క్షుణ్ణంగా పరిశీలించి ఏకాగ్రతతో జవాబులు రాయడం మొదలు పెట్టాలి. శరీరం ధృడంగా ఉంటేనే మానసికంగా బలంగా ఉంటాం. మంచి ఆహారం, తగినంత నిద్రతో ఆరోగ్యాన్ని పదిలంగా ఉంచుకోవచ్చు. విద్యార్థులు ప్రతి రోజూ తగినంత నీరు తాగాలి. అలాగే తల్లిదండ్రులు తమ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి. విద్యార్థులను టీవీ, సెల్‌ఫోన్లకు దూరంగా ఉంచితే మంచిది.

–డాక్టర్ అభినయ్, సీహెచ్‌సీ సూపరింటెండెంట్, అవుకు

గడ్డమేకులపల్లెను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతాం

- ఎక్సైజ్ శాఖ ఉమ్మడి కర్నూలు జిల్లా డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి



గడ్డమేకులపల్లె గ్రామస్తులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎక్సైజ్ అధికారులు

అవుకు: అవుకు మండలం గడ్డమేకులపల్లె గ్రామం నాటుసారా తయారీకి పేరుగాంచిందని, ఆ పేరును చెరిపేసి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తామని ఎక్సైజ్ శాఖ ఉమ్మడి కర్నూలు జిల్లా డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి అన్నారు. గురువారం గడ్డమేకులపల్లె గ్రామంలో ఆ శాఖ అసిస్టెంట్ కమిషనర్ హనుమంతరావు, నంద్యాల జిల్లా అధికారి రవికుమార్‌తో కలిసి సారా నిర్మూలనకు నవోదయం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నాటుసారా తయారీ అపరిశుభ్రంగా, అశాస్త్రీయ పద్ధతిలో తయారు చేయడం వల్ల విషపూరితంగా మారుతుందని తెలిపారు. దీన్ని తాగడం వల్ల అనేక దుష్ప్రభావాలు కలుగుతాయన్నారు. ఆరోగ్యం దెబ్బతినడం, ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ తగాదాలు, రోడ్డు ప్రమాదాలు, గొడవలు తలెత్తుతాయని తెలిపారు. వారి కుటుంబాలు రోడ్డున పడుతాయన్నారు. నాటుసారా తయారీని వదిలేస్తే ఆ కుటుంబాలకు ఉపాధి కల్పించి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. పిల్లల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ నాటుసారాకు దూరంగా ఉండాలని సూచించారు. అధికారుల మాటలను పెడచెవిన పెట్టి నాటుసారా తయారు చేసినా, అమ్మినా, రవాణా చేసినా, నిల్వ ఉంచినా చట్టరీత్యా నేరమన్నారు. అలాంటి వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. 8 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.5 లక్షల వరకు జరిమానా విధించే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో బనగానపల్లె రూరల్ సీఐ మంజునాథ్‌రెడ్డి, ఎక్సైజ్ సీఐ వర్ధనాదేవి, ఎస్‌ఐ కమలాకర్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సారా విక్రేతల అరెస్ట్

డోన్ రూరల్: సారా విక్రయిస్తున్న ముగ్గురిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ వరలక్ష్మి తెలిపారు. పట్టణంలోని ఆ శాఖ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. నంద్యాల ఎక్సైజ్ సూపరింటెండెంట్ రాముడు ఆదేశాల మేరకు పలు ప్రాంతాల్లో దాడులు నిర్వహించామని తెలిపారు. బేతంచెర్ల కోటపేట కాలనీకి చెందిన మీనిగ రేమేష్, మీనిగ మధు నాటుసారా విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకున్నామన్నారు. అలాగే ప్యాపిలి మండలం అలేబాద్‌తండా గ్రామానికి చెందిన మధావత్ భీముడు నాయక్ సారా అమ్ముతుండగా అరెస్టు చేశామని తెలిపారు. నిందితులు ముగ్గురి నుంచి 90లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఎక్కడైనా సారా తయారీ చేసినట్లు లేదా విక్రయిస్తున్నట్లు తెలిస్తే సమాచారం ఇవ్వాలని కోరారు. వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు. సారా రహిత గ్రామాలుగా మర్చేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. సీఐ లక్ష్మదాస్, ఎస్‌ఐలు రమేష్, దౌలత్‌ఖాన్, హెడ్ కానిస్టేబుల్ సుధాకర్‌రెడ్డి, కానిస్టేబుల్స్ ఉమాకాంత్‌రెడ్డి, బషీర్, గోపాల్, పాములేటి, రవికుమార్ సిబ్బంది ఉన్నారు.



స్వాధీనం చేసుకున్న సారాను చూపుతున్న సీఐ వరలక్ష్మి

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

డోన్ రూరల్: పదో తరగతి విద్యార్థులు భయం వీడి ధైర్యంగా పబ్లిక్ పరీక్షలు రాయాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సూర్యప్రతాప్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలల పదో తరగతి విద్యార్థులకు గురువారం ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో మోడల్ టెస్ట్ నిర్వహించారు.పరీక్ష అనంతరం విద్యార్థులకు పెన్నులు, ప్యాడ్‌లు అందించారు. ఈ సందర్భంగా సూర్యప్రతాప్ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో భయాన్ని పోగొట్టడానికే మోడల్ పరీక్ష నిర్వహించామని తెలిపారు. మొత్తం 500 మంది హాజరైనట్లు చెప్పారు. సమాజాన్ని మార్చే శక్తి కేవలం విద్యార్థులకు మాత్రమే ఉందని.. అందరూ మంచి మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ నాయకులు శశిధర్‌రెడ్డి, మనోజ్, ప్రవీణ్, మహేష్ అస్లాం తదితరులు పాల్గొన్నారు.



పెన్నులు, ప్యాడ్‌లు అందుకున్న విద్యార్థులు

పుచ్చకాయ.. ఆరోగ్యానికి రక్ష

కొలిమిగుండ్ల: వేసవి సెగ మొదలైంది. భానుడు భగభగ మండుతున్నాడు. ప్రయాణికులతో పాటు విద్యార్థులు, ఉద్యోగులు, వివిధ రంగాల్లో పనిచేసే కార్మికులకు పాట్లు తప్పడం లేదు. పుచ్చకాయలు దాహార్తితో పాటు ఆకలిని తీరుస్తోంది. పుచ్చకాయ ఆరోగ్యానికి ఎంతో మంచిది. దాహాన్ని తగ్గిస్తుంది. చెమట ద్వారా వచ్చే ఖనిజ లవణాల లోపాలను పుచ్చకాయ తగ్గిస్తుంది. జ్వరంతో బాధపడుతున్నావారు పుచ్చకాయ రసంలో తేనే కలిపి తాగితే నీరసం తగ్గి శక్తినిస్తుంది. మలబద్ధకం ఉన్న వాళ్లు ప్రతి రోజు పుచ్చకాయ వాడితే సమస్య తగ్గుముఖం పడుతుంది. ఎండిపోయిన పెదవులను తడిగా ఉంచుతుంది. ఈకాయలో ఉన్నంత నీరు ఏకాయలో ఉండదు. సుమారు 96 శాతం నీరే ఉంటుంది. మూత్ర విసర్జనలో మంట ఉన్నవారికి పుచ్చకాయ రసంలో స్పూన్ తేనే కలిపి ప్రతి రోజు తీసుకుంటే గుండె జబ్బులు, మూత్ర పిండాల వ్యాధులు తగ్గుతాయని వైద్యులు చెబుతున్నారు.



అమ్మకానికి సిద్ధంగా ఉంచిన పుచ్చకాయలు

ఇరుకు రోడ్లు.. ఇక్కట్లు

డోన్: పట్టణంలోని గుత్తిరోడ్డు ఫ్లైఓవర్ వద్ద ఇరుకురోడ్డుతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. డోన్ నుంచి గుత్తి, అనంతపురం వెళ్లే వాహనాలతో పాటు అక్కడి నుంచి డోన్–బేతంచెర్ల, బనగానపల్లె, నంద్యాల వైపుకు ఈ బ్రిడ్జి వద్ద నుంచే వెళ్లాల్సి ఉండడంతో నిత్యం ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. ఎదురుగా ఒక వాహనం వస్తే ముందుకు వెళ్లలేని పరిస్థితి. కొందరు టీడీపీ నాయకులు ఫ్లైఓవర్ నిర్మాణ సమయంలో తమ స్థలాలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉండేందుకు అప్పటి కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తెచ్చి రోడ్డు వెడల్పు కాకుండా అడ్డుకోవడంతో ఈ పరిస్థితి నెలకొందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ ప్రాంతంలో తరచూ ప్రమాదా లు సైతం చోటుచేసుకుంటున్నాయి. అధికారులు స్పందించి బ్రిడ్జికి ఇరువైపులా రోడ్డును మరింత వెడల్పు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



గుత్తి రోడ్డులో ఫ్లైఓవర్ వద్ద వాహనదారుల అవస్థలు

మహిళలు ఎందులోనూ తక్కువ కాదు



మాట్లాడుతున్న డోన్ సివిల్ కోర్టు జడ్జి తంగమణి



సన్మానం అందుకున్న మహిళలతో అధికారులు

డోన్ రూరల్: మహిళలు ఎందులోనూ తక్కువ కాదని.. బాగా చదువుకుని అన్ని రంగాల్లో రాణించాలని డోన్ సివిల్ కోర్టు జడ్జి తంగమణి అన్నారు. పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో గురువారం ముందస్తుగా అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జడ్జి తంగమణి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దేశంలో మహిళలకు ఎన్నో అవకాశాలు ఉన్నాయని.. వాటిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. విద్యతో సమాజంలో మహిళలకు గుర్తింపు లభిస్తుందని చెప్పారు. మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. వారిని చిన్నచూపు చూడకూడదన్నారు. మహిళల్లో చైతన్యం రావాలని, ఏ సమస్య వచ్చినా ధైర్యంగా ముందుకు వచ్చి పోరాడాలని సూచించారు. సమస్యలు వస్తే కుంగిపోకూడదని.. ఎదుర్కొని ముందుకెళ్లాలని తెలిపారు. ముఖ్యంగా చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. పురుషులతో సామానంగా ముందుకు వెళితే కుటుంబ, దేశ పురోగతి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. చిన్న వయసులో పిల్లలకు పెళ్లిళ్లు చేయడం నేరమని తెలిపారు. ఇలా చేయడం వల్ల వారి జీవితాలు చేజేతులా నాశనం చేసిన వారవుతారన్నారు. ఆడ పిల్లలను బాగా చదివిస్తే కుటుంబంలో వెలుగులు నింపుతారని పేర్కొన్నారు. వారి ఇష్టాలను తెలుసుకుని వారిని నచ్చిన రంగాల్లో ప్రోత్సహించాలని సూచించారు. అనంతరం మహిళలకు శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పట్టణ సీఐ ఇంతియాజ్‌బాషా, ఎంఈఓ ప్రభాకర్, ఐసీడీఎస్ సీడీపీఓ షంషాద్‌బేగం, ఉపాధ్యాయుడు సుమన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పద్మావతి, పరమేశ్వరి, శోభారాణి, శకుంతల, సుగుణమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు అరుణ, జయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీడీసీడీ సర్వే తనిఖీ



సిబ్బందికి సూచనలు చేస్తున్న జిల్లా నోడల్ అధికారి కాంతారావు

బేతంచెర్ల: మండల పరిధిలోని సిమెంట్‌నగర్ గ్రామంలో ఎన్‌సీడీసీడీ సర్వేను జిల్లా నోడల్ అధికారి డాక్టర్ కాంతారావు నాయక్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్య సిబ్బంది బాధ్యతగా సర్వే చేయాలని సూచించారు. గృహ సర్వేలో అనుమానిత క్యాన్సర్ కేసులను గుర్తించి ప్రభుత్వ ఆస్పత్రికి పంపాలని తెలిపారు. డాక్టర్ హెహతాబ్, ఎంఎల్‌హెచ్‌పీలు సువర్ణ, రాజేశ్వరి, ఏఎన్‌ఎం వరలక్ష్మి ఉన్నారు.

ఒత్తిడి వీడితే మంచి ఫలితాలు



మాట్లాడుతున్న సమగ్ర శిక్ష కోఆర్డినేటర్

డోన్ టౌన్: విద్యార్థులు ఒత్తిడి, భయాన్ని వీడితే పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని సమగ్ర శిక్ష పీఎంయూ కోఆర్డినేటర్ చాయంద్ర కుమార్ అన్నారు. పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించడం ఎలా అనే అంశంపై స్థానిక కొత్తపేట (రోకలి బండ స్కూల్)హైస్కూల్‌లో విద్యార్థులు, ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరీక్షలంటే భయం, ఒత్తిడి, డిప్రెషన్‌తో చదువుపై దృష్టి సారించలేని వారి కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కేరీర్ మెంటల్ హెల్త్ కౌన్సిలర్‌లను నియమించిందని తెలిపారు. వీరి ద్వారా పిల్లల్లో భయం వీడేలా కౌన్సిలింగ్ ఇస్తున్నట్లు చెప్పారు. పిల్లలను చైతన్య పరిచి వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపి ఉత్తమ ఫలితాలు సాధించేలా చర్యలు తీసుకుంటారన్నారు. కార్యక్రమంలో జీసీడీఓ నాగ సువర్చలా, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం మాణిక్యంశెట్టి, కౌన్సిలర్ శ్రీరామ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బేతంచెర్లకు రూ.1.43 కోట్ల నిధులు

బేతంచెర్ల: స్థానిక నగర పంచాయతీకి రూ. 1.43 కోట్ల 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరైనట్లు బేతంచెర్ల నగర పంచాయతీ కమిషనర్ హరి ప్రసాద్ గురువారం తెలిపారు. పట్టణంలో మౌలిక సదుపాయాల కల్పిన, పట్టణ అభివృద్ధి,తాగునీటి సమస్య పరిష్కారానికి ఈ నిధులు ఖర్చు చేయనున్నట్లు వెల్లడించారు.

వేధిస్తున్న సిబ్బంది కొరత

బనగానపల్లె: మండలంలో వ్యవసాయ సిబ్బంది కొరత వేధిస్తోంది. మొత్తం 25 పంచాయతీలు, 49 గ్రామాలు ఉన్నాయి. ఆరు వ్యవసాయ విస్తరణ అధికారుల పోస్టులు ఉండగా ముగ్గురు మాత్రమే పనిచేస్తున్నారు. వీరిలో ఒకరు సెలవుపై ఉన్నారు. ఇక గ్రామాల్లో 25 మంది గ్రామ వ్యవసాయ సహాయకులు పని చేయాల్సి ఉండగా ముగ్గురు ప్రమోషన్‌పై బదిలీ అయ్యారు. మరో ఐదుగురు మెడికల్ లీవ్‌లో ఉన్నారు. 8 మంది ఎంపీఈఓలు పని చేయాల్సి ఉండగా ఇద్దరు సెలవుపై వెళ్లారు. సుమారు 30వేల ఎకరాల వ్యసాయ సాగు భూములు ఉన్నాయి. పంటల సాగు సమయంలో మెళకువలతో పాటు ఈ–క్రాప్ నమోదు చేయాల్సి ఉంది. సిబ్బంది కొరతతో పనులు సకాలంలో జరగడం లేదు. రైతులకు సలహాలు, సూచనలు అందక ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పూర్తి స్థాయిలో వ్యవసాయ సిబ్బందిని నియమించాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయంపై మండల వ్యవసాయ అధికారి సుబ్బారెడ్డిని వివరణ కోరగా సిబ్బంది తక్కువగా ఉన్న విషయం వాస్తమేనని.. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు.



బనగానపల్లె వ్యవసాయశాఖ కార్యాలయం

మహా ధర్నాను విజయవంతం చేయండి

డోన్ టౌన్: అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ విజయవాడలో ఈ నెల తలపెట్టిన మహా ధర్నాను విజయవంతం చేయాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు షేబారాణి, కార్యదర్శి జులేఖ పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో సీడీపీఓ షంషాద్‌బేగంను కలిసి వినతిపత్రం అందజేశారు. అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గతంలో 42 రోజుల పాటు సమ్మె చేసిన కాలంలో ప్రభుత్వం ఒప్పందం చేసుకున్న అంశాలపై జీఓ విడుదల చేయాలని కోరారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి శివరామ్, సీపీఎం పట్టణ అధ్యక్షుడు నక్కి శ్రీకాంత్, సంఘం నాయకులు సులోచన, ఎస్తేరమ్మ, సుమలత, రహమత్‌బీ, గుల్జార్బీ, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్యాపిలి: జలదుర్గం సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ఏఈ వినయ్ కుమార్ తెలిపారు. 11 కేవీ లైన్ నిర్మాణ పనుల కారణంగా రామకృష్ణాపురం, మాధవరం, గార్లదిన్నె గ్రామాల్లో ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. రైతులకు ఉదయం 5 నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 7 గంటల వరకు విద్యుత్ సరఫరా చేస్తామన్నారు.

చెరువుకట్టపై మద్యం సీసా, వాటర్ ప్యాకెట్లు, గ్లాసులు



చెరువు కట్ట.. మందుబాబులకు అడ్డా

అవుకు: మండల కేంద్రంలోని అవుకు చెరువు కట్ట మందుబాబులకు అడ్డాగా మారింది. చుట్టూ కొండల మధ్య ఆహ్లాదకరమైన వాతావరణంలో ఈ చెరువు చూపురులను ఎంతో ఆకట్టుకుంటుంది. పర్యాటకులతో పాటు స్థానికులు ఉదయం, సాయంత్రం వేళల్లో ఈ చెరువుకట్టపై చల్లగాలిని ఆస్వాదిస్తుంటారు. కొందరు వాకింగ్ చేస్తుంటారు. అయితే కట్ట వద్ద పర్యవేక్షణ లోపం కారణంగా మందుబాబులకు నిలయంగా మారింది. రాత్రి అయితే చాలు మందుబాబులు విచ్చలవిడిగా కట్టపైకి చేరి మద్యం సేవిస్తున్నారు. ఖాళీ బాటిళ్లు, వాటర్ ప్యాకెట్లు, గ్లాసులను అక్కడే వదిలేసి వెళ్తున్నారు. భద్రత ఉండదని కొందరు.. పగిలిపోయిన మద్యం సీసాలు ఎక్కడ కాళ్లకు గుచ్చుకుంటాయోనని వాకర్స్ కట్టపైకి రావడమే మానేస్తున్నారు. మందుబాబులు చెరువు కట్టపై మద్యం సేవించకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.